


(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)

# -148-

(11 జూన్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

"**రచయితలు నిర్ధిష్టమైన** రచనలు చెయ్యాలి పటిష్టిమైన భాష ఉపయోగించాలి సాంప్రదాయాన్ని పాటించాలి. పదికాలాల బాటు జీవించే అవకాశం కల్పించుకోవాలి" అంటూ ఇటీవల విజయవాడ సభలో జరిపిన సాంస్కృతిక సమ్మేళనంలో పలువురు ప్రముఖులు సలహాలిచ్చారు.

ఇవి మాటిమాటికీ ఇచ్చే సలహాలేననే భావంతోనేమో కొన్ని పత్రికలు మచ్చుముక్కలు కొన్ని ప్రచురించి వూరుకున్నాయి. అవును మరి పదే పదే చెప్పే మాటలకు క్రొత్తదనం ఏం వుంటుంది అవి రచయితల కోర్కెలనేం తీరుస్తాయి?

నిజానికి రచనల బాధ్యతలు, వాటి నుంచి లభించే గౌరవాన్ని పొందే అర్హతలూ, ప్రజలనుండి పొందే మన్ననలను స్వీకరించే అదృష్టం. వీటి విషయం ఏ రచయతకా రచయిత చూచుకోవాలిగాని సందేశాలిస్తే వూరుకొంటారా? పెద్దలు శాసిస్తే వొద్దికతో అంగీకరిస్తారా?

ఎవరి బుర్రలోంచి ఎలాటి భావాలు పలుకుతాయో ఎవరికి తెలుస్తుంది? ముందుగా అతగాడు రచన చేస్తేగానీ వూరుకోలేడుగా.

సభలూ సమావేశాలూ, సందేశాలు, విమర్శలు చెడు మాటలు వల్ల రచయితలలో మార్పు తేలేదింకా అని ఒక రచయిత మిత్రుడొకతని కలుసుకుని “ఏమిటి ఈ మధ్య నువ్వు ప్రచురిస్తున్న కథలన్నీ అలా చచ్చుగా వుంటున్నాయి?” అని ప్రశ్నించిందట. ఆ రచయిత, "పకపకా నవ్వి నాకే లేని బాధ నీకెందుకయ్యా" అన్నాడట.

అలా అసందర్భంగా రచయితల్ని పోషించి, ఆదరించే పత్రికలు కొన్ని లేకపోలేదు. వచ్చిపడే కథల ప్రవాహంలో సృష్టించింది తక్కువ. దాహాన్ని ఎడారికి తర్జించే పత్రికలూ వున్నాయి. ‘పోనీలే ఒకరిని ఉద్ధరిద్దాం' అని జాలిపడే పత్రికలూ వున్నాయి. వాటిని మనం ఆపలేం అది ఒక భ్రాంతి. ప్రతి హృదయం రాగరంజితం అవాలంటే ఆక్షేపణ ఏం వుంటుంది.

"ఓ మేకా, మేకా

నిన్ను నరికిపారేస్తా

పెద్ద కొలిమిలో కరిగించేస్తా

నీ నడుం మీద గ్రుచ్చు కొన్నావెందుకు

నీకీ హింసాతత్వం మారదా

ఓ కిర్సనాయల్ మేకా

ఓ పర్సనాలిటీ తెలియదా

ఓ మేకా! మేకా

నిను పీకి పారేస్తా

చాలా కాలం క్రింద ఒక యువకుడు వ్రాసి వ్రాసి పత్రిక్కి పంపిన గేయ రాజమిది. ఆయనగారి "గుండె అలా ఊసులాడింది"

దాన్ని జాతీయ గీతం చెయ్యాలనే ఆసక్తి వుంటుంది అతనికి. అంత ఆనందం పొందుతాడు కాని ఇతరుల్ని కూడా పొందమనడంలో వుంది తిక్క.

రచయిత తన గొప్పతనం తాను కల్పించుకుంటున్నంతసేపూ రచనల గొప్పతనాన్ని గురించి యోచించలేడు పాపం. అయితే పాఠకులు ఇతర రచనలు చదివేటప్పుడు రచయిత గొప్పతనాన్ని పక్కనబెట్టుకుంటూ చదివితే సాహిత్యానికి వుండవలసిన గొప్పతనానికి ముప్పు రాదు.

ఆయనేదో నవల రాశాడు. పోనీగదా అని నేనేదో చదివేశాను. పోయిందేం వుంది? అంటూ వుంటారు కొందరు. పాపం ఏం పోతుందో కూడా తెలియదా పాఠక మహాశయునికి. విలువైన కాలం పోతుంది. విజ్ఞత పోతుంది. వివేకం పోతుంది. ఆయన గారిలో గల విచక్షణకు గల విలువపోతుంది. అన్నింటినీ మించి ఆయనలో వుండే సాహిత్య గౌరవం సన్నగిల్లిపోతుంది.

చాలాకాలం క్రింద అప్పటికే మంచి పేరు కీర్తులు సంపాదించిన ఒక రచయిత నన్నూ మరో మిత్రుడ్ని పిలిచాడు కథ వినిపిస్తానని. సరేనని వెళ్ళాం. కాఫీ ఇచ్చి చదవడం ప్రారంభించాడు కథ. మేము మౌనంగా విన్నాం.

ఆయన ఆపివేసి నవ్వుతూ మా ముఖం వంక చూశాడు. మా ముఖంలో నవ్వులు కనిపించలా.

"కథ అయిపోయింది" అన్నాడు.

"అయితే వెళ్ళివస్తాం"అన్నాం.

ఆయన నిర్ఘాంతపోయి "వెళ్ళి వస్తారా? ఏం ఎలా వుందో చెప్పలేదేం విన్నారుగా" అన్నాడు.

"మిమ్మల్ని పిలిచి మర్యాద చేసి కథ చదవడం నా బుద్ధి తక్కువ ఇలాంటివాళ్ళని తెలియదు. కథ విన్నాక ఎలా వుందో చెప్పక్కర్లేదా? నిజానికి మీ అభిప్రాయం నాకో లెక్క కాదు. ముక్కోటి ఆంధ్రులు ఒక్కొకరు మూడుమార్లు చదువుతారు" అన్నాడు.

ఆరోజు ఆయన్ని అభినందించి వుంటే మాకు చాలా టీపార్టీలు జరిగేవి కాని తెలివితక్కువ తనం వల్ల వాటిని పోగొట్టుకున్నాం. కొంతమంది రచనలు చేసినా వారి కార్యక్రమం పూర్తి కాకుండానే ఇతరులు బాగున్నదనేదాకా వోపిక పట్టలేక వారే పిలిచి వినిపించి బాగున్నదనిపించుకోవడం కూడా 'కథా దృష్టికి' సంబంధించిన భాగంగానే భావిస్తారు.

మొన్న యింటి ప్రక్కన వున్న ఒక విద్యార్థి వచ్చాడు. నాలుగో క్లాసు పరీక్షలకు వెళ్ళాడు. రిజల్టు కోసం ఎదురు చూస్తున్నాడు. రెండు మూడు రోజుల్లో చెబుతారని తెలిసిందిట. ఆ సందర్భంలో చెప్పాడు "రాత్రి దేవుడికి దణ్ణం పెట్టుకున్నానండీ" అని.

"ఏమని పెట్టుకున్నావు?" అన్నాను.

"నేను పరీక్ష ప్యాసయ్యానని అందరూ చెప్పుకోవాలని"అన్నాడు. నాకెంతో సంతోషంకలిగింది. అతడంత అమాయకంగా చెప్పినందుకు. 'నేను ప్యాసవ్వాలి. అందరూ అది విని నన్ను అభినందించాలి ' అని అతడి తాత్పర్యమై వుంటుంది. దాన్ని అలా తిప్పి చెప్పాడు పాపం.

ఈ కుర్రవాడు చెప్పిన పద్ధతి కొందరు రచయితల విషయంలో సరిపోతుందనిపిస్తుంది. వారి సంకల్పం ఉత్తమమైన రచనలు సాగించి, ప్రజల మన్ననలను పొందాలనే ఆకాంక్ష కంటే, తను వ్రాసింది చూచి ఇతరులు ఎన్నడూ పొందని ఆనందం పొందాలనేదే వారి ఆశయమై వుంటుంది. వారి రచనలలో కనిపించని 'పరా' ఒకటి వుంటుంది. పాఠకులు దాన్ని అర్థం చేసుకోవాల్సిన అవసరంకూడా వుంటుంది.

ఇంతకీ చెప్పవచ్చిందేమంటే ఎవరికి తోచిన విధంగా వారు వ్రాస్తూ వుంటారు. వారికి అందులో తృప్తే వుండవచ్చు. వాటిని స్వీకరించడం విషయంలో శ్రద్ధ తీసుకోవలసింది పాఠకులు. అచ్చులో పడిందల్లా చదవాలనీ, చదివి మెచ్చుకోవాలని, మెచ్చుకుని ఇతరుల బుర్రల్ని కూడా గిచ్చి పోవాలనీ ఇలా ముక్తపదగ్రస్తమైన కోరికలుండటం అటు సారస్వతాన్ని ఇటు పాఠకుల్ని మచ్చ చూపడమే అవుతుంది.

పాఠక లోకం నీరూ, పాలూ వేరుచేయగల రాజహంసగా రాణించకలిగినప్పుడు ఎవరేం వ్రాస్తేనేం? ఏ చెట్టునేం పువ్వు పూస్తుందో కోసే ఆకుకి ఘుమఘుమను బట్టి తెలియాలి.

అంతేగాని వ్రాతల మీద నిషేధాలెక్కడనుంచి వస్తాయి? "చెయ్యి తిరగని వాళ్ళు కూడా వ్రాయవచ్చు. తప్పేం వుంది? కురూపి సంతానం పొందడం లేదా?" అన్నారొక ప్రముఖ శతావధాని.

Post your comments